అధ్వానంగా తండాల రోడ్లు

- కంకర వేసి వదిలేసిన పెద్దతండా(ఎం) రహదారి
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

జనగామ రూరల్: గ్రామాలు, తండాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని గొప్పలు చెప్పుకోవడమే తప్ప ఆచరణలో కనబడడం లేదు. 500 జనాభా ఉన్న తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారే తప్ప కనీస వసతులు కల్పించలేదు. రోడ్లు, జీపీ భవనాలు లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారు. అత్యవసర వైద్యానికి వెళ్లలేని దుస్థితి. మండలంలోని తండాలకు బీటీ రోడ్లు లేక అధ్వానంగా ఉన్నాయి. పెద్దతండా (ఎం), ఎర్రకుట తండా, అజ్మీరా తండా, బాషానగర్ దోనబాయితండా, రామస్వామి తండా, పంతులు తండా, రేక్యా తండా, బాచ్యాతండా రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ముఖ్యంగా ఎర్రగొల్లపహాడ్ నుంచి జనగామకు వెళ్లే రోడ్డు కంకర తేలి నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారింది. పెద్దతండా (ఎం)లో రోడ్డు వేసేందుకు నాలుగేళ్ల క్రితం కంకర వేసి వదిలేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు నిలిచిపోయినా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని తండాలకు బీటీ రోడ్లు వేయాలని గిరిజనులు కోరుతున్నారు.


పెద్దతండా (ఎం)లో కంకర వేసి వదిలేసిన రోడ్డు

బీటీ రోడ్డు వేయాలి..



ఆర్భాటంగా తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారు కానీ అభివృద్ధి మాత్రం చేయడం లేదు. నేటికీ తండాలకు కనీసం రోడ్డు కూడా లేకుండా అధ్వానంగా ఉన్నాయి. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని తండాలకు రోడ్లు మంజూరు చేసి అభివృద్ధి చేయాలి.

- బానోత్ రాంకోటి, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు

వైద్యసేవలకు వెళ్లాలన్నా ఇబ్బందే..



తండాల నుంచి అత్యవసర సేవలకు గర్భిణులు జనగామకు వెళ్లాలన్నా, అబులెన్స్ రావాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. తక్షణమే రోడ్డుపై గుంతలు పూడ్చాలి. కంకర వేసి వదిలేసిన రోడ్డును వెంటనే పూర్తి చేయాలి.

- అజ్మీరా సురేష్, ఎర్రగొల్లపహడ్

క్లుప్తంగా

మంత్రికి ఆహ్వానం



కొడకండ్ల: మండలకేంద్రంలో బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రావాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును గౌడ సంఘం నాయకులు ఆహ్వానించారు. గురువారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్‌లో సంఘం అధ్యక్షుడు దేశగాని శ్రీశైలం ఆధ్వర్యంలో మంత్రిని కలిసి కోరగా వస్తానని తెలిపినట్లు గౌడ సంఘం నాయకులు చెప్పారు. సంఘం నాయకులు సతీష్‌గౌడ్, వెంకన్న, సోమయ్య, వెంకన్న, నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అవగాహన



పాలకుర్తి: గ్రామాల్లో విద్యుత్ వినియోగంపై నిర్వహించే అవగాహన కార్యక్రమాలతో వినియోగదారుల నుంచి మంచి స్పందన వస్తుందని స్టేషన్‌ఘన్‌పూర్ డీఈ హుస్సేన్ నాయక్ అన్నారు. గురువారం పాలకుర్తి మండల పరిధిలో విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ వినియోగదారులు రూ.1,050 డీడీ చెల్లిస్తే మీటర్లను బిగించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ ఉపేందర్, ఏడీఏ శ్రీధర్, సబ్ ఇంజనీర్ జవహర్ తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి దుర్గామాత ఉత్సవాలు




బచ్చన్నపేట: మండలంలోని మన్‌సాన్‌పల్లిలో ఈనెల 11వ తేదీ నుంచి దుర్గామాత ఉత్సవాలను నిర్వహించనున్నట్లు సర్పంచ్ పంజాల తారశ్రీధర్‌గౌడ్ తెలిపారు. గురువారం సర్పంచ్ మాట్లాడుతూ ఉత్సవాలు రెండు రోజుల పాటు జరుగుతాయని చెప్పారు. వేడుకల కోసం ఆలయాన్ని అందంగా సుందరీకరించామన్నారు. గ్రామంలో ఎలాంటి అల్లర్లు జరుగకుండా ఎస్సై నవీన్‌కుమార్, సృజన్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మహిళలు ఉద్యమించాలి



జఫర్‌గఢ్: మహిళలు స్వేచ్ఛ, సమానత్వం కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి షబాన కోరారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐద్వా మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం తమ్మడపల్లి (జి)లో మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గుండెబోయిన రోజా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమాజంలో తరతరలుగా మహిళలు లింగవివక్షకు గురవుతున్నారన్నారు. మహిళల జీవితాల్లో మార్పు రావాలంటే చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించడంతో పాటు స్వేచ్ఛ, సమానత్వం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజమ్మ, యశోద, రమ, సుభాషిణి, రాజేశ్వరి, అనూష, సంధ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ శివారు పెట్రోల్ బంక్, దాబా సమీపాన జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన వట్టె నరేందర్‌రెడ్డి తన భార్య శ్రీలతతో కలిసి ఘన్‌పూర్ శివారులో వివాహ కార్యక్రమానికి బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో రోడ్డు క్రాస్ చేస్తుండగా కారు ఢీకొట్టడంతో రత్నాకర్‌రెడ్డి తలకు, భుజానికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అందించిన సమాచారం మేరకు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

మినీటెక్స్‌టైల్ పార్క్ ప్రకటనపై హర్షం


సీఎం, మంత్రి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న పద్మశాలీలు

కొడకండ్ల: మండలకేంద్రంలో మినీ టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు జీఓను జారీ చేయడం పట్ల పద్మశాలీ సంఘం నాయకులు హర్షం వెలిబుచ్చారు. ఈ మేరకు గురువారం మండలకేంద్రంలో సీఎం కేసీఆర్, మంత్రి దయాకర్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పద్మశాలీ సంఘం అధ్యక్షుడు, సర్పంచ్ పసునూరి మధుసూదన్ మాట్లాడుతూ పద్మశాలీల చిరకాల వాంఛను నెరవేర్చడం సంతోషంగా ఉందని, మినీ టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుతో ఎందరికో ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి చేకూరుతుందన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా జీఓను మంత్రి కేటీఆర్.. మంత్రి దయాకర్‌రావుకు అందించడంపై కృతజ్ఞతలు తెలిపారు. సంఘం నాయకులు వెంకననారాయణ, నవీన్, రమేష్,శ్రీనివాస్, పొన్నం వెంకన్న, ఉప సర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు


మాట్లాడుతున్న అనిల్‌కుమార్

నర్మెట: బీఆర్ఎస్ నాయకుల అక్రమాలను విమర్శించిన నాయకులపై అక్రమ కేసులను పెడుతున్నారని, ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని బీజేపీ జిల్లా కార్యదర్శి సాక్కం అనిల్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కోర్టులో కేసు వాయిదాకు హాజరైన అనంతరం ఆయన మాట్లాడారు. అన్యాయాన్ని విమర్శిస్తే అక్రమ కేసులను పెడుతారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు ఎన్ని కేసులను పెట్టినా వారు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజాక్షేత్రంలో ఎండగడుతామని హెచ్చరించారు. జిల్లా మాజీ అధ్యక్షుడు కేవీఎల్ఎన్ రెడ్డి, మండల అధ్యక్షులు ధరావత్, రాజు నాయక్, నాయకులు చెవుల రాజు, మంచాల రవీందర్, జహంగీర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రగతితో మారిన గ్రామాల ముఖచిత్రం


క్షేత్ర పరిశీలనలో జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి

లింగాలఘణపురం: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేపట్టిన పల్లె ప్రగతితో గ్రామాల ముఖ చిత్రం మారిందని జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి అన్నారు. మండలంలో నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్ మిషన్(ఎస్‌బీఎం) మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని రామచంద్రగూడెంలో వంశీధర్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దాలని సర్పంచ్ వాణిసురేందర్‌రెడ్డిని కోరారు. అదేవిధంగా రూ.1.80 కోట్లతో గ్రామంలో నిర్మిస్తున్న బీటీ రోడ్డును వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్, సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వాణిసురేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కిరణ్‌కుమార్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గణపతి, నాయకులు కుమార్, ఎంపీడీఓ మల్లికార్జున్, ఆంజనేయులు, గంగాధర్, కరుణాకర్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


సదస్సులో మాట్లాడుతున్న స్వప్న

రఘునాథపల్లి: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, ఇంటా, బయటా తమకు జరిగే వేధింపులపై న్యాయపరంగా పోరాడాలని సహాయ న్యాయ సంరక్షణ సంస్థ సహాయకులు ఇట్టబోయిన స్వప్న, రాగల్ల శ్రీహరి సూచించారు. రాష్ట్ర న్యాయ సేవా సహకార సంస్థ, హైదరాబాద్ నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంలోని సెయింట్ ఆల్ఫోన్స్ పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వరకట్నం, లీగల్ యాక్ట్‌లు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం సుజాత, పారాలీగల్ వలంటీర్ జైహింద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌కు వినతి

పాలకుర్తి టౌన్: అర్చక, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాని రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌కు బుధవారం తొర్రూరులో మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో తెలంగాణ దేవాదాయ ధర్మాదాయశాఖ అర్చక ఉద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డీవీఆర్‌శర్మ వినతి పత్రం అందజేశారు. అర్చక, ఉద్యోగులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా వేతనాలు నెల నెలా ఇవ్వకుండా మూడు నెలలకు ఒక నెల వేతనం చెల్లించడంతో అర్చక, ఉద్యోగుల కుటుంబాలు ఇబ్బంది పడుతున్నారని మంత్రి కేటీఆర్ దృష్టికి తెసుకెళ్లినట్లు తెలిపారు. సర్వీస్ కాలంలో మూడేళ్లు పూర్తి చేసిన అర్చక, ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని తదితర సమస్యలను మంత్రికి విన్నవించామన్నారు. త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.


మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న డీవీఆర్‌శర్మ

అడవి పందులు అడ్డొచ్చి ట్రాక్టర్ బోల్తా

- ఆరుగురు బిహార్ కూలీలకు తీవ్రగాయాలు

పాలకుర్తి టౌన్ : అడవి పందులు అడ్డొచ్చి ట్రాక్టర్ బోల్తా కొట్టిన సంఘటనలో బిహార్‌కు చెందిన ఆరుగులు కూలీలు తీవ్రగాయాలపాలైన సంఘటన గురువారం రాత్రి ముత్తారంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధి ముత్తారంలో బిహార్‌కు చెందిన 15 మంది కూలీలు హైటెన్షన్ విద్యుత్ లైన్ పనులు ముగించుకొని మల్లంపల్లికి ట్రాక్టర్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో అడవి పందుల గుంపు ట్రాక్టర్‌కు అడ్డం రావడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఆరుగురు కూలీలకు తీవ్రగాయాల కావడంతో చికిత్స నిమిత్తం ప్రైవేటు వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.


మృతిచెందిన అడవి పంది


ప్రమాద స్థలంలో క్షతగాత్రులు


బోల్తాపడిన ట్రాక్టర్

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



బచ్చన్నపేట: మండలంలోని జీపీల్లో రికార్డుల నిర్వాహణ సక్రమంగా ఉండాలని ఎంపీడీఓ రఘు రామకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని భోనకొల్లూర్‌లో ఆయన పర్యటించి వన నర్సరీలను పరిశీలించి జీపీ రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మీస అయిలుమల్లయ్య, పంచాయతీ కార్యదర్శి సతీష్‌రెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

పుస్తెమెట్టెల అందజేత



బచ్చన్నపేట: కట్కూర్ గ్రామానికి చెందిన దేవరాయ పోషయ్య కూతురు వివాహానికి సామాజిక సేవాకర్త, బీజేపీ రాష్ట్ర నాయకుడు ముక్కెర తిరుపతిరెడ్డి పంపించిన పుస్తె, మెట్టెలను ఆ పార్టీ నాయకులు గురువారం అందించారు. కుదునూరు పాండు, ఎనుగుల రూప, జంగ మాధవి, యనమల్ల పర్షయ్య, మూసిని మహేష్, గుంటిపల్లి నాగరాజు, అంజనేయులు, పొట్టి మధు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


మృతురాలి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి


బచ్చన్నపేట: దహన సంస్కారాల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్

నర్మెట: జెడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్ నాయనమ్మ మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి గురువారం పరామర్శించారు. బొమ్మకూర్‌కు ఎమ్మెల్యే వెళ్లి మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు పండుగ మల్లేష్ నాయకులు నేరటి సుధాకర్ తదితరులు ఉన్నారు.

దేశాయితండాలో..

మండలంలోని దేశాయితండా మాజీ సర్పంచ్ భూక్య ఐలమ్మ గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేసి దహన సంస్కారాల్లో పాల్గొన్నారు. ఉప సర్పంచ్ భూక్య శ్రీను, ఎంపీటీసీ భూక్య యాదగిరి ఉన్నారు.

ఎంపీడీఓకు..

చిల్పూరు: ఎంపీడీఓ పులుగు వేణుగోపాల్‌రెడ్డి తల్లి సరోజన మృతి చెందింది. కాగా, గురువారం హనుమకొండలోని ఆయన నివాసానికి వెళ్లి ఎంపీపీ, ఎంపీటీసీలు, నాయకులు పరామర్శించారు. ముందుగా సరోజన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ బొమ్మిశెట్టి సరిత, ఎంపీటీసీలు సాదం నర్సింహులు, భూక్య యాదగిరి, మునిపల్లి సుధాకర్ బీఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రసిడెంట్ బాలరాజు, నాయకులు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం

దేవరుప్పుల: మండలంలోని పెద్దమడూరుకు చెందిన నాగిళ్ల లాలమ్మ మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయంతోపాటు క్వింటాల్ బియ్యం అందించారు. కార్యక్రమంలో బబ్బూరి యాదగిరి, నాగరాజు, కారుపోతుల శ్రీనివాస్, గ్రామ రైతు కోఆర్డినేటర్ ఆకవరం పెద్దారెడ్డి, ఉపసర్పంచ్ వెంకటేష్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు నల్ల ఉమేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు రాములు తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీకాంత్‌గౌడ్

కోతులతో నానా తంటాలు


దేవరుప్పల వాగు వంతెనపై సందడి చేస్తున్న వానరాలు

దేవరుప్పుల : మండల కేంద్రంలోని వాగుపై ఉన్న వంతెన మీదుగా దేవరుప్పుల, ధర్మాపురం తదితర గ్రామాల తోపాటు పాలకుర్తికి సులభంగా వెళ్లే మార్గం ఇది. ఈ వంతెనపై నిత్యం కోతుల కవాతుతో వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. బుధవారం వంతెనపై కోతుల సందడితో భయాందోళనకు గురైన పలువురు ద్విచక్రవాహనదారులు వంతెన కింది నుంచి పోవాల్సిన దుస్థితులను ఎదుర్కొన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల నుంచి శాశ్వతప్రాతిపదికన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి


శిబిరంలో వైద్యాధికారితో గ్రామస్తులు

బచ్చన్నపేట: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి సిద్దార్థరెడ్డి అన్నారు. మండలంలోని బండనాగారంలో జీపీ కార్యక్రమంలో కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామస్తులు అందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని, అవసరమున్న వారికి అద్దాలను అందిస్తారని తెలిపారు. సర్పంచ్ శివరాత్రి కవిత, ఉప సర్పంచ్ బత్తిని రాజలింగం, ఏఎన్ఎం ప్రణీత, కార్యదర్శి భరత్, రాజనర్సు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగికి సన్మానం



జనగామ రూరల్: మహిళా దినోత్సవం సందర్భంగా ఉత్తమ మహిళా ఉద్యోగినిగా అవార్డు అందుకున్న వై.కళావతిని గురువారం స్కూల్ ఎడ్యుకేషన్ ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫోరం అధ్యక్షుడు కే పవన్‌బాబు, కార్యదర్శి ఎండీ నూరుద్దీన్, జి.వేణుమాధవ్, బి.శ్రీనివాస్‌రావు, డి.హేమంత్‌కుమార్, బి.ఉమాదేవి, రషీద్, ప్రసాద్ పాల్గొన్నారు.

మాదిగల చేతిలో బీజేపీకి గుణపాఠం తప్పదు


మాట్లాడుతున్న రాజశేఖర్

స్టేషన్‌ఘన్‌పూర్: ఎస్సీల వర్గీకరణ విషయంలో మాదిగలు, మాదిగ ఉపకులాలను దగా చేసిన బీజేపీకి రానున్న రోజుల్లో తగిన గుణపాఠం తప్పదని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పైస రాజశేఖర్ అన్నారు. ఎస్సీల రిజర్వేషన్ల వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించకుండా మోసం చేస్తున్న బీజేపీ వైఖరిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగల మహా సంగ్రామయాత్ర ఆరో రోజైన గురువారం స్టేషన్‌ఘన్‌పూర్‌కు చేరింది. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చాడా ఏలియా అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీల వర్గీకరణ విషయంలో మాదిగలకు మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం మాట తప్పి మోసం చేసిందన్నారు. ఎస్సీల వర్గీకరణ విషయంలో నాన్చివేత ధోరణి అవలంబిస్తున్న బీజేపీపై యుద్ధం తప్పదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు ఇనుముల అనీల్, నలిమెల నాగరాజు, మంద శ్రీనివాస్, గోవిందు ఇసాక్, గాదె శ్రీధర్, గుర్రం అశోక్, నవీన్, శ్రీనివాస్, సురేష్, రాంచందర్ పాల్గొనగా కాంగ్రెస్ నాయకులు ఐలపాక శ్రీనివాస్, మారపాక వసంత్, ఇస్రం శ్రీనివాస్ తదితరులు సంఘీభావం తెలిపారు.